క్లుప్తంగా

27 నుంచి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం : స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈనెల 27వ తేదీ రాత్రి విష్వక్సేన, కలశ పూజలతో అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 28న కల్యాణోత్సవం, 29న గరుడ సేవ, 30న చక్రస్నానం, 31న పుష్పయాగంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు. ఉత్సవాల్లో పుత్తూరు లాస్య తరంగిణి వారిచే భరతనాట్య ప్రదర్శన, అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే కచేరీలు ఏర్పాటు చేసినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు.

వరిలో ఎలుకల నివారణపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని గోవిందప్పనాయుడుకండ్రిగలోని రైతులకు గురువారం మండల వ్యవసాయాధికారిణి భారతి వరి పంటలో ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. వరి పంటలో ఎలుకల నివారణకు బ్రోమోడిలిన్ మందు 10 గ్రాములు ఎకరాకు ఎరగా వాడాలని తెలిపారు. ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలని, మోతాదుకు మించి మందును వాడకూడదని, విషపు ఎరను చేతితో తాకకూడదన్నారు. వరి పైరులో ఎలుక ఎర తయారు చేసే విధానాన్ని రైతులకు తెలియజేశారు.

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శికి సత్కారం



విమానాశ్రయం వెలుపల స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి చిక్కమగరవల్లి తిమ్మేగౌడ్ రవికి గురువారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి, ఎస్వీ రమణ, మండల అధ్యక్షుడు హరీష్ రెడ్డి, కృష్ణయ్య ఉన్నారు.

ఇళ్ల స్థలాలకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడు గ్రామస్తులు గురువారం ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఇంటి స్థలాలు లేకపోవడంతో ఒకే ఇంటిలో మూడు కుటుంబాల వారు నివసిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253 సర్వే నెంబర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నిరాజ్, కత్తిధర్మయ్య, సర్పంచ్ జనార్దన్ పాల్గొన్నారు.

రక్తనిధి కేంద్రానికి రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సత్యవేడు : స్థానిక కమ్యూనిటీ వైద్యశాలకు నూతనంగా మంజూరైన రక్తనిధి కేంద్రానికి పాలిటెక్నిక్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ.. స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు తొలుత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవిని అభినందించారు. కార్యక్రమంలో పాలిటెక్నికల్ కళాశాల అధ్యాపకులు దినేష్ చంద్ర, ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటేశ్వర్లు సందీప్ కుమార్, దిలీప్ కుమార్, ప్రసాద్, నర్సులు శివగామి, అను, ఫార్మసిస్టు జ్యోతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీపీఎం సభలను జయప్రదం చేయండి

వరదయ్యపాళెం : నెల్లూరులో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం కేవీబీపురంలో స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆ పార్టీ నాయకులు మునిశంకర్, రేవతి, బత్తెమ్మ పాల్గొన్నారు.

స.హ.చట్టం జిల్లా కార్యదర్శిగా భాగ్యరాజ్

కేవీబీపురం (వరదయ్యపాళెం) : సమాచార హక్కు చట్టం సాధన కమిటీలో కేవీబీపురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన వెట్టి భాగ్యరాజ్‌కు చోటు లభించింది. ఆ మేరకు జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంస్థ గురువారం నియామక పత్రాన్ని అందజేసింది.

నిర్వహణ..నిర్లక్ష్యం!

జనాభా రోజురోజుకూ పెరుగుతున్న సత్యవేడులో ఆహ్లాదం అందని ద్రాక్షగా మారుతోంది. పంచాయతీ పరిధిలో సుమారు 20 వేల మంది నివాసం ఉంటున్నారు. అయినా పార్కు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఫలితంగా ఖాళీ సమయాల్లో సేద తీరడానికి ఎదురుచూపులే మిగులుతున్నాయి. గత ప్రభుత్వంలో అప్పటి సర్పంచ్ పార్కు ఆధునీకరణకు చర్యలు చేపట్టారు. కానీ నిధుల కొరతతో పనులు అర్ధంతరంగా ఆపేశారు. రెండేళ్లుగా పట్టించుకోకపోవడంతో పార్కు ముళ్లపొదలతో నిండిపోయింది.

– సత్యవేడు

ఉద్యానవనంలో పెరుగుతున్న పిచ్చిమొక్కలు





బొమ్మకు రంగులు వేసి వదిలేసిన దృశ్యం

- ఆహ్లాదం అందేదెన్నడో?
- సత్యవేడులో అభివృద్ధికి నోచుకోని పార్కు
- నిధుల కొరతతో ఆగిన అభివృద్ధి పనులు

గతేడాది ఆగస్టులో ఎన్టీఆర్‌పార్కును తుడా నిధులతో ఎమ్మెల్యే అభివృద్ధి చేయించేందుకు ముందుకొచ్చారు. పార్కులోని బొమ్మలకు తొలుత రంగులు వేయించారు. తుడా సిబ్బంది ముళ్లపొదలు తొలగించారు. పార్కు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, పూల మొక్కలు నాటేందుకు ట్రాక్టర్లతో ఎర్రమట్టి తోలి వదిలేశారు. అయిదు నెలలుగా పార్కు పనులు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో మళ్లీ గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.

అభివృద్ధికి దూరంగా పనులు

సత్యవేడు పట్టణంలోని తెలుగు గంగ కాలువ సమీపంలో ఏర్పాటు చేసిన ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యం కొరవడింది. పిల్లలకు ఆట వస్తువులు, ప్రహరీ నిర్మాణం , గడ్డి పెంపకం, మొక్కలు, వ్యాయామం, వాకింగ్ ట్రాక్ పూర్తి స్థాయిలో ఏర్పాటుకు నోచుకోలేదు. ఉన్న ఒక్క పార్కు అబివృద్ధి లేక సత్యవేడు– తిరుపతి రోడ్డులో కళావిహీనంగా మారింది.

ఎండిన మొక్కలు

మాజీ సర్పంచ్ పద్మావతి సుమారు రూ. 2 లక్షల ఖర్చుతో ఉద్యానవనం ఆధునీకరణ పనులు చేపట్టారు. రాజమండ్రి నుంచి పలు రకాల పూల మొక్కలు తెప్పించి నాటించారు. నీటి వసతికి పైపులు అమర్చారు. నిర్వహణ లేకపోవడంతో నాటిన మొక్కలు వేసవిలో ఎండిపోయాయి. ప్రస్తుతం ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. నేడు తుడా అధికారులు ఉద్యానవనంలో ముళ్లపొదలు తొలగించి మట్టి తోలి వదిలేశారు.



పార్కులో ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలు



వాకింగ్ ట్రాక్, పూలమొక్కలు నాటేందుకు తోలిన మట్టి

శ్రీసిటీ యాజమాన్యం సుముఖత

మండల పరిధిలో పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్న శ్రీసిటీ ఫౌండేషన్ సత్యవేడులో పార్కు అభివృద్ధికి చొరవ చూపాలని సత్యవేడు ప్రజలు కోరుతున్నారు. పార్కును ఆధునీకరిస్తే ఉద్యోగులు, చిన్నారులు, అనేక కుటుంబాలు, వృద్ధులకు ఖాళీ సమయాల్లో ప్రశాంతంగా గడిపేందుకు అవకాశం ఉంటుంది. వాకర్స్‌కు ఎంతో మేలు కలుగుతుందని విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు. పార్కు అభివృద్ధికి శ్రీసిటీ యాజమాన్యం సుముఖతగా ఉన్నట్లు సమాచారం.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



పార్కు ఆధునీకరించి విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులకు అనువుగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. రోడ్ల వెంట నడుస్తుండడంతో కాలుష్యం అధికంగా ఉంది. మరోవైపు ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. పార్కులోనే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

- బలరాం, విశ్రాంత ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి, సత్యవేడు

ఆడుకునేందుకు వసతులు కల్పించాలి



పార్కులో చిన్న పిల్లలు ఆడుకొనేందుకు, విద్యార్థులు చదువుకొనేందుకు, బల్లలతో పాటు పచ్చిక మైదానం ఏర్పాటు చేస్తే చదువుకొనేందుకు అవకాశం ఉంటుంది. పట్టణానికి సమీపంలో పార్కు ఉండడంతో తక్కువ సమయంలో ఉద్యానవనానికి వచ్చి పోయే అవకాశం ఉంటుంది.

- ప్రసన్నకుమార్, ఇంటర్ విద్యార్థి, సత్యవేడు

ఒత్తిళ్లకు దూరంగా ఉండేందుకు..



ఒత్తిళ్లకు దూరంగా ఉండేందుకు పార్కు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రోజూ ఒత్తిళ్లతో గడుపుతున్న జనం కాసేపు సేదతీరేందుకు పార్కు ఉపయోగపడుతుంది. పేదలు తమ పిల్లలను బయటకు తీసుకెళ్లలేరు. ఇక్కడైతే కాసేపు పిల్లలు సరదాగా ఆడుకునేందుకు వీలుంటుంది. పెద్దలు వాకింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. పార్కులో వసతులు కల్పించాలి.

- రేవతి, బలిజవీధి, సత్యవేడు

భక్తుల సమస్యలు పరిష్కరించండి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సమస్యలను పరిష్కరించాలని హిందూ ధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్ బాబు ఈఓ బాపిరెడ్డిని కోరారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో నిత్యం వాహనాల రాకపోకలతో భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్లు, బస్సులు, టూరిస్టు వాహనాల పార్కింగ్ కోసం శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రస్తుతం ఉన్న స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు చాలడం లేదన్నారు. అలాగే ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎదురయ్యే సమస్యలను ఆయనకు వివరించారు.

కూరగాయల సాగు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిచెన్ గార్డెన్ కోసం గురువారం ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య గోంగూర, తరుగాకు, తోటాకు, మెంతాకు, బెండ, చిక్కుడు, సొర, బీరకాయలు, ముల్లంగి విత్తనాలను నాటారు. పాఠశాల ఆవరణలో కూరగాయలు సాగు చేయడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వాటిని వాడుకోవచ్చునని తెలిపారు. కూరగాయల సాగుపై వంట నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్రబాబు, ధనుంజయులు, కిషోర్, మస్తానయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

పెన్షన్ విశ్రాంత ఉద్యోగుల హక్కు



మాట్లాడుతున్న అధ్యక్షుడు నాగేశులు

సత్యవేడు : విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పొందడం ప్రాథమిక హక్కు అని విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలూకా యూనిట్ అధ్యక్షుడు నాగేశులు పేర్కొన్నారు. గురువారం పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి గౌరవంగా జీవించడానికి ఇచ్చే జీవన భృతి అన్నారు. ప్రభుత్వం పీఆర్‌సీ అమలు చేయాలని, ఐఆర్ వెంటనే ఇవ్వాలని, డీఆర్ బకాయిలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 80 సంవత్సరాలు పైబడిన సూపర్ సీనియర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోషియేట్ అధ్యక్షుడు నాగూర్, వెంకటసుబ్బయ్య, బలరాములు, రవిబాబు, మునీంద్రుడు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



ఏపీ సీడ్స్ కార్యాలయంలో నేతాజీ వేడుకల్లో నేతలు

శ్రీకాళహస్తి : సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం పట్టణంలోని బాబు అగ్రహారం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జ్ఞానప్ప, స్కౌట్స్ కమిషనర్ రమేష్‌బాబు, సహాయ కమిషనర్ పార్వతి, యూత్ చైర్మన్ అజారుద్దీన్, మహేంద్ర పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం గుండేలిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుముని తిరుమలయ్య ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, రమాదేవి, భాస్కరయ్య, శ్రీకర్, మునీశ్వర్‌రెడ్డి, జయసింహ, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్, ట్రేడ్ యూనియన్ కోఆర్డినేటర్ సెంటర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, పార్వర్డ్ బ్లాక్ పార్టీ నేత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరరామరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో మునెయ్య, జయరామయ్య, సుధాకర్ తదితరులు ఉన్నారు.

- తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాలలో నేతాజీ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



నేతాజీకి నివాళి అర్పిస్తున్న స్కౌట్ అండ్ గైడ్స్



నేతాజీ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంతలో అభివృద్ధి పనులు



భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంటలోని వారపు సంతలో అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. వారపు సంతలోని సమస్యలపై 'సాక్షి'లో ఈనెల 5వ తేదీన 'ఇదేం సంత' కథనం ప్రచురితం అయింది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పది రోజుల కిందట సంతలో సీసీ కెమెరాలు, దొంగలున్నారు జాగ్రత్త అంటూ మైక్ అనౌన్స్మెంట్, బాత్ రూంల పరిశుభ్రత చేయించారు. అందులో భాగంగానే ప్రస్తుతం సంతలో అంతర్గత సీసీ రోడ్డులు, నూతన బాత్‌రూం నిర్మాణాలు, తాగునీటి కోసం బోరు వేసేందుకు పూజలు చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, మునిచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, మహబూబ్ బాషా, పుష్పనాదన్, నాదమునిరెడ్డి పాల్గొన్నారు.

'ఉల్లాస్'పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు : ఉల్లాస్ కార్యక్రమం ద్వారా సత్యవేడు మండలంలోని 43 కేంద్రాల్లోని 442 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వాలంటీర్లు దృష్టి సారించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. నోడల్ అధికారి ప్రసాద్, ఏపీఎం డాంగే యాదవ్, సూపర్ వైజర్ థామస్ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా చేయాలన్నారు. చట్టాలపై అవగాహన, టోల్‌ఫ్రీ నంబర్ల ఉపయోగం, ఈ–మెయిల్, సామాజిక మాధ్యమాల వాడకం, వివిధ యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించేలా బోధనా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు పయణి, శివకుమార్, పురుషోత్తం, మంగయ్య, మండల సమాఖ్య సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై న్యాయం చేయండి



వివాదానికి కారణమైన పొలంలో వెంచర్ దారి కోసం తోలిన మట్టి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : పూర్వీకుల నుంచి అనుభవంలో ఉన్న భూమిని కొందరు ప్రైవేట్ వెంచర్ దారి కోసం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితుడు నాగముంతల రవి ఆరోపించారు. రేణిగుంట మండలం కృష్ణాపురంలోని సర్వే నెంబర్ 308/8లో గల మూడెకరాల 30 సెంట్ల భూమిలో కొందరు ప్రైవేట్ వెంచర్ దారి కోసం మట్టి తోలడంతో గురువారం వివాదం రేకెత్తింది. భూమికి సంబంధించిన పత్రాలన్నీ ఉన్నాయని కానీ రెవెన్యూ అధికారులు కనీసం స్పందించడం లేదని బాధితుడు వాపోయారు. దీనిపై తహసీల్దారు సురేష్ మాట్లాడుతూ.. భూ వివాదం మా దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందిని పంపించి విచారణ జరపాలని ఆదేశించామన్నారు. ఆ సర్వే నెంబర్ ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా చూపిస్తోందని , ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.


సమస్యలకు పరిష్కారం ఏదీ ?

- మొక్కుబడిగా సమావేశాలు
- నేడు మండల సర్వసభ్య సమావేశం

నారాయణవనం : మూడు మాసాలకొకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలు మండలంలో మొక్కుబడిగా సాగుతున్నాయి. అలా కాకుండా దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం, సౌకర్యాల కల్పనపై ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశంలో చర్చించిన అంశాలు, తీర్మానాల అమలుపై తదుపరి సమావేశంలో సమీక్షించకపోవడంతోనే సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా పూర్తి స్థాయిలో శుక్రవారం ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలోనైనా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

సమస్యలు ఇవీ..

- పాలమంగళం నార్త్ వద్ద అరుణానదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. కానీ అటు, ఇటు వైపు వంతెనకు రోడ్డు కలిపితే రాకపోకలు సాగించవచ్చు. కానీ ఈ పనులు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నదీ ప్రవాహంతో అటువైపు రాకపోకలు స్తంభిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడంలో తాత్సరం చేస్తున్నారు.



అలంకారప్రాయంగా పాలమంగళం నార్త్ హైలెవల్ వంతెన

- నారాయణవనంలోని పద్మావతీనగర్‌లో సుమారు రూ.14 లక్షల అంచనా వ్యయంతో నాలుగేళ్లగా అంగన్‌వాడీ భవన నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ఫలితంగా రేకుల షెడ్‌లో కేంద్రం నడుస్తోంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో మాత్రం స్పందన లేదు.
- భూసర్వేలో సాగు భూమి విస్తీర్ణం పక్క ఖాతాల్లోకి మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల కష్టాలను రెవెన్యూ అధికారులు ఉదార స్వభావంతో వ్యవహరించి పరిష్కరించాల్సి ఉంది.
- పర్యాటక కేంద్రమైన కైలాసనాథ కోనలో అనాధికారికంగా నిర్మించిన భవనాల్లో కొనసాగుతున్న రిసార్ట్‌లపై నిఘా, నియంత్రణ లేక అసాంఘిక కార్యక్రమాలకు వేదికలవుతున్నాయి.



నాలుగేళ్లుగా కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనం

కాంగ్రెస్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నియామకం

శ్రీకాళహస్తి : కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా షేక్ కరీముల్లా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు కావమ్మకు పొంగళ్లు

నాగలాపురం : శ్రీ కావమ్మ సమేత మారయ్య ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి పొంగళ్లు పెట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు విరివిగా తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.